

కథ 2014

5

# ఇస్సాకు చిలక

అద్దేపల్లి ప్రభు

"ఇస్సాకు జగడాల మారి... అడికి గీరెక్కువ... వూరందరితోటి ఆడికి కజ్జాలే.." అంది మఱ్రిచెట్టు మీద చిలక. కొమ్మకి ముక్కుని తెగ రాసుకుంటున్న పక్కనున్న ఇంకో చిలక తల పైకెత్తకుండానే "ఇసాకెవడు?" అంది.

"అదుగో కింద చూడు ఆ బోది పక్కన పడుకున్నాడే ఆడే ఇసాకు," చూసింది చిలక.

కింద ఎర్రమట్టి బాట పక్కన నిండుగా పారుతున్న పంటబోది. నడుం వరకూ నీళ్లలో మునిగి పడుకున్నాడొక మనిషి. అతనిమీద పడుంది సైకిలు. అతని ముడ్డిమీద నిక్కరు లేదు. చొక్కా చివళ్లు నీటిలో కదులుతున్నాయి. ముఖం కనపడడం లేదు. రెండు మూడు ఎలకలు అతని మీంచి అటూ ఇటూ పాకుతున్నాయి.

"అదుగో ఇస్సాక్కోసం ఊరి జనం వస్తున్నారు."

దూరంగా ఓ గుంపు జనం వేగంగా అడుగులేస్తూ వస్తున్నారు. ఇద్దరు ముగ్గురు సైకిళ్ల మీద రయ్యిని వస్తున్నారు.

"ఆడు పడుకోలేదు. రాలిపోయాడు," అంది ముక్కు గీరుకుంటున్న చిలక.

మొదటి చిలక ఏమనలేదు. కిందికి చూస్తుండిపోయింది.

మొదటి సైకిళ్ల మీద వచ్చిన కుఱ్రాళ్లు సైకిళ్లని అలాగే వదిలేసి గబగబా పడున్న ఇసాకుని బయటికి లాగి వెల్లకిలా తిప్పారు. ముఖం వికృతంగా ఉంది. చెంపల మీద అక్కడక్కడ చేపలు కొరికిన గాట్లున్నాయి. దాదాపు నల్లగా మాసిన ఎర్రచొక్కా సగం ఊడిపోయి ఉంది.

ఈలోగా మిగతావాళ్లు కూడా పరుగు పరుగున వచ్చి మూగారు. ఇద్దరు పిల్లలు, "నానా... నానా..." అంటూ ఏడుస్తున్నారు.

ఒక లావుపాటి ఆమె వాళ్లిద్దర్ని ఓదారుస్తోంది.

ముఖం ఎంత పరిశీలనగా చూసినా గుర్తుకు రావడంలేదు. ఇది ఇసాకు ముఖమేనా? ఆ గుడ్లూ... ఎలక కన్నాల్లాంటి ముక్కులు... సగం తెరిచిన నోరు... బూడిదరంగుకి తిరిగిన పళ్లు... ఇస్సాకు ముఖం గుర్తుకు రావడంలేదు అనుకుంది చిలక.

"రోజూ చూసే ఇస్సాకు ముఖమే... గుర్తుకు రాడంలేదేటి?" అంది పక్కని చిలకతో.

"రాలిపడ్డాక ఇంక ముఖమేటి... పేరేటి?" అని తూతుర్...తూతర్... అంటూ ఒక్కసారిగా పైకెగిరి రెక్కలు ముడిచి బాణంలా దూసుకెళ్లి తాటిచెట్టు మీద వాలింది ఆ చిలక.

దాని వెంటే వెళ్లి పక్కన వాలింది.

దూరంగా వూరు కనిపిస్తోంది. కోతకి సిద్ధమౌతోన్న వరి పొలాలన్నీ వొయ్యారంగా వూగుతున్నాయి. అక్కడక్కడ గట్ల మీద కొంగలు వాలి ఉన్నాయి. ఊరి నించి యిటు పొలాల్లోకీ చేపల చెరువుల్లోకీ వెళ్లే దారి సన్నటి పాపిడిలా కనిపిస్తోంది. దానిమీద చీమల్లాంటి మనుషులు ఒక మనిషిని భుజాల మీద మోసుకొని పోతున్నారు.

"ఆణ్ణి రోజూ చూస్తాను. కానీ ఆడి ముఖం గుర్తుకు రాటంలేదు," అంది చిలక.

"ముఖాలతో మనుషులకి పనిగానీ మనకి పనేటుంది?"

రివ్వున వీచే గాలికి అవి కాస్త ఊగుతున్నాయి.

"అయినా యింతలా ఆడి గురించి చెపుతన్నావు. కొంపతీసి నువుగానీ ఆడి చిలకవా ఏమీ?" అడిగింది చిలక.

ఆ చిలక పలకలేదు. గుండ్రని గుడ్లని అటూ ఇటూ తిప్పి, ''నేనూళ్లోకి వెళ్లొస్తా,'' అంటూ రివ్వున గాల్లోకి లేచింది.

*

ఇస్సాకు ఇంటిముందు గడ్డిపరిచి దానిమీద చాప వేసి పడుకోబెట్టారు ఇస్సాకుని. మెడ వరకూ పాత దుప్పటి నొకదాన్ని కప్పారు. మెల్లగా ఊరి జనమంతా పోగడుతున్నారు. చూరుకింద మట్టి అరుగుమీద ఆడోల్లు కూర్చుని పిల్లల్ని అక్కున చేర్చుకుని ఓదారుస్తున్నారు.

''నిన్న పొద్దుట గావాల గుణ్ణంవోరి చేలో బోన్లెడతన్నప్పుడు చూశాను. మళ్లీ కాపల్లేదు,'' అంటున్నాడు సుందర్రావు.

''ఎవుడిక్కాపడతాడు? ఆ ఎలకలేడనుకుంటే ఆడనే ఆడు.''

''ఇంతకీ బానే ఉండేవాడు గదా... ఎలా పోయాడు?''

''తాగీసి.. పీకలమొయ్యా తాగేసి పాదాలమ్మ గరువు కాణ్ణుంచి రాత్రేల తూలు కుంటూ సైకిలు తొక్కుకుంటూ వస్తున్నాడంట. మందెక్కువై డోకెల్లిపోయింది. సైకిలడిపోయింది. తీసేవోడూ లేడు. ఈడు లెగలేడు.. ఇంకేటి?'' కొంత హితబోధ చేస్తున్నట్టు చెప్పాడు ఊరి ముసలయ్య. కుర్రాళ్లు చూశారు.

''అంతే మరి ఇలగిలగ పోయాడంటే పోలీసోల్లు రారా... ఆల్ల ఎంకవైరీలకీ ఆటికీ ఎవడు పడతాడు? ఇదే కనఫర్మ్. గుట్టుసప్పుడు కాకుండా తీసుకెళ్లి బొంద పెట్టేదాం,'' అన్నాడు దావీదు.

''ఆడు కయ్యాలమారే కాని ఎప్పుడూ ఎవణ్ణీ కొట్టినట్లూ లేదు. తన్నులు తిన్నట్టూ లేదు. ఊళ్లో ఆడితో కొట్లాడేవాళ్లు లేరు. మరెలా పోయాడంటా?'' అంది మరియమ్మ.

''మడుసులెట్ట పోతారో సెప్పగలోల్లుంటరుగానీ దెయ్యంలా పొద్దుగాలా తిరిగేవోడు ఎట్ట పోయాడంటే ఎవళు సెప్పగల్రు?'' అంటూ సాగదీసింది పాపాయమ్మ.

''ఏటయినా ఆడి గురించేడ్డాకి ఆడి పెల్లవైనా ఇక్కన్నేదు కదా,'' మరియమ్మ.

''కొయిటాలో ఉన్న పెల్లం వచ్చేవరకూ కర్మాగుతుందా ఏటీ?'' అంది మరో ఆవిడ.

గుంపులూ గుసగుసలూ సాగుతూనే ఉన్నాయి.

మరోపక్క పెట్టి సిద్ధం చేసి మొగాళ్లందరూ బయలెల్లిపోతున్నారు.

ఎదురింటి డాబా పక్కన జామచెట్టు మీద ఆకుల వెనక నక్కి కూర్చున్న ఇస్సాకు చిలక పాడె వెనకబడింది.

*

ఎలకల్ని పట్టడంలో ఇసాకుని మించిన మొనగాడు ఆ చుట్టుపక్కల ఎక్కడా లేడు.

''సాదేవుడికి అశ్వవృదయం తెలిసినట్టు నాకు ఎలక వృదయం తెల్సు. కాబట్టి నేను పంచపాండవుల్లో సాదేవుళ్లాటోణ్ణి,'' అంటాడు ఇస్సాకు. బక్కగా ఎముకలు తేలి ఉంటాడు అతడు. బాగా వదులుగా ఉన్న నిక్కరు లోంచి రివటల్లాంటి కాళ్లు పొడుచుకుని వొచ్చినట్టు ఉంటాయి. నల్లటి ఆ కాళ్లమీద నల్లనల్లని తెల్లతెల్లని వెంట్రుకలు సీమచింత చెట్టుని అల్లుకున్న గురివింద తీగల్లా ఉంటాయి. కమ్యూనిస్టు సభల్లో ఇచ్చిన ఎర్రని షర్టు వేసుకుంటాడు. ఏనాడు దువ్వని తల చిందరవందరగా పడుతుంటుంది. కన్నంలోని ఎలకల్లాగా కళ్లు చురుగ్గా ఉంటాయి. అతడు గుడ్లు పెద్దవి చేసి అడ్డగోలుగా మాట్లాడుతుంటే ఎవడైనా నోరు మూసుకుని పోవల్సిందే.

''బాబూ... చౌదరిబాబు తవరి మాటకడ్డు వచ్చాననేటనుకోకండి. తమరి గెడ్డం కింద గెంజి తాగి బతికేటోళ్లం. కోపమైపోకండిగానీ తవరంత ఎదవ నాకొడుకు ఈ వూల్లోనే కాదు. ఈ సుట్టుపక్కల ఏడా కనపడ్డండి,'' అంటాడు.

తూముకాడ కూర్చుని కబుర్లాడుతున్న చౌదరి ముఖం మాడిపోతుంది.

''ఏట్రా ఇస్సాకు ఏటి మాట్లాడుతున్నావ్?''

''లేపోతే ఏటండీ... మూడేళ్లనించీ కాలవపూడికలు తీలేదు. ఈసారి తీయాలన్నారు. బానేఉంది. మాకేదో పని దొరుకుతుందని నాలుగు డబ్బులొత్తాయనీ అనుకుంటే పొక్లీనరుతో సేయిద్దమంటారు. మరి మేం బతికేదెట్టా?''

''ఓరెదవా పూడిక తీసేంతమంది కూలోల్లేడున్నార్రా? వొయసు పిల్లగాళ్లంతా సెక్యూరిట జాబులనీ, నూనెమిల్లుల్లో పన్లనీ, పోర్టులో పన్లనీ కాకినాడ పోతే ఈనుపుల్ల కాళ్లోడివి నువ్వూ... ఈకల్నేరిసిపోయిన నేనూ చేత్తామా?'' ఇంత నోరుపెట్టి అరిచాడు ముసలయ్య.

''ఒరే పెద్దోడా... అనకూడదుగానీ నువు చౌదరి బాబు కన్నా ఎదవ్వి... ఈయేల ఈ మిసను తెచ్చారు. రోపింకోటి తెత్తారు. అపుడేటి సేత్తావ్?'' దావీదు కల్పించుకుని,

''ఇస్సాకన్నా... నువ్వా ఎలకల్నట్టుకోడం తప్ప ఏ పనికిరావు... నీకెందుకురా ఇయ్యన్నీ,'' అన్నాడు.

''ఓహో...పెద్ద కమ్యూనిస్టు కదా... ఎవుడి గురించీ ఈడికక్కర్లేదు... సుత్తిరా... కొడవల్రా... ఎర్రసొక్కారా... ఎర్రజండారా... దావీదు బాగోతం చౌదరి కెరుక... చౌదరి బాగోతం దావీదు కెరుక. ఆడి ఈడి గోత్రాలో... బొక్క

ల్లోంచి సూసే ఎలకలకెరుకో...'' అని పాడుకుంటూ పోతాడు.

వూరికి ఆడో కాలక్షేపం. ఏ పనికి రాడు. ఏ పనిని చైనీడు. ప్రతిదానికి అడ్డుపుల్ల లేస్తాడు.

ఎలకలే ఆడి చుట్టాలు. బంధువులూనూ.

భుజమ్మీద వెదురుగడకి పదులకొద్దీ బుట్టల్ని కట్టుకొని గోచి పెట్టుకొని ఇస్సాకు పొలాల్లో ఎలకల్ని పడతాడు. ఎలక్కి ఏభై రూపాయలు. బొక్కల్లో దొరికితే ధాన్యం ఆడిదే.

ఏపుగా ఎదిగి పాలు పోసుకున్న చేలో కాస్త బురద బురదగా ఉన్న నేలమీద పాదాలు దిగబడుతుండగా నడుస్తాడు. కన్నం కనపడ్డచోట అరచేత్తో చరుస్తాడు. చెవి పెట్టి పగిలిన సీమచింతకాయల్లాంటి గుడ్లని గిరగిరా తిప్పుతూ ఏదో వింటాడు. తెచ్చిన గడ్డిని కన్నంనిండా కూరుస్తాడు. ఎక్కడా జాగాలేకుండా జిగురుమట్టితో పాముతాడు. అలా అన్ని కన్నాలకీ గడ్డి కూరుస్తూ వచ్చి చివరికి ఓ కన్నం పట్టుకుంటాడు. అన్ని కన్నాలకీ అగ్గి ముట్టించి పొగ ఊదుతాడు. కన్నాల దగ్గర బోనులు పెడతాడు. ఇంకక్కడ కూర్చుని పాటలు పాడ్డం మొదలు పెడతాడు.

*ఏరా ఎంకటి నరసా*
*జేబులో లేదొక పైసా సినిమాకి పోదమంటే*
*లేదొక పైసా*
*కొట్టుకాడి కెల్దామంటే*
*ఏరా ఎంకటి నరసా...*

ఎలకలు పడ్డాకా బాగా బలిసిన నాలుగైదు ఎలకల్ని పట్టుకొని వేరే పెడతాడు. కన్నాన్ని తవ్వేసి అందులో ఎలకలు దాచిన ధాన్యంలో తాలంతా ఎగర బోసి మిగిలినదంతా మూట కట్టుకుంటాడు.

ఆ సాయంత్రం ఆడిల్లున్న వీధంతా ఎలకని కాలుస్తున్న వాసనే.

బలిసిన ఎలకల్ని కొట్టేసి తాటాకుల్నీ గడ్డినీ తెచ్చి మంటెట్టి అందులో కాలుస్తాడు. శ్రద్ధగా తోలు వొలిచి ముక్కలు కొట్టి కూరొండుతాడు. ధాన్యాన్ని రోట్లో వేసి దంచుతాడు. చేటలో పోసి చెరిగేసి బియ్యాన్ని తీసి అన్నం వొండుతాడు.

చౌదరి సీక్రెట్‌గా నడుపుతున్న చెల్లయమ్మ కొట్టుకెళ్లి మందు పుల్లుగా తాగేస్తాడు.

''చెల్లయమ్మకో మొగుడు... గిలాసులు కడగ డానికి... బాటిలు కాయలు తేడానికి... చెల్లయమ్మకింకో మొగుడు ఆడెవడో నేన్ చెప్పను... చౌదరి బాబని చచ్చినా చెప్పను...''

ఇలా వాక్కుంటూ వచ్చి వేపచెట్టు దగ్గర చిందు లేసి పడిపోతాడు. ఆడిపిల్లలిద్దరూ అణ్ణి మోసుకెళ్లి ఇంటో పడేశాక ఏ రాత్రేళో లేచి కూర తినేస్తాడు. తొంగుండిపోతాడు.

*

ఊళ్లో పిల్లలూ పెద్దలూ అందరూ కాలవగట్టున చేరి వింతగా చూస్తున్నారు. ఒక పొక్లేనర్ కాలువని పూడిక తీస్తోంది. కొంగ మెడలా ఉన్న పళ్ల దవడ ఒకటి కసుక్కున నేలలోకి దిగబడుతోంది. రయ్యిని పక్కకి తిరుగుతోంది. దానికదే మట్టిని గట్టుపైన పోసేస్తోంది. పిల్లలు దాని వెనకపడ్డారు.

''నేను ముందే చెప్పాగదా. ఈ మిసను ఇంకో గంటలో కాలువంతా చెక్కేసి పోద్ది. మనవంతా అట్టా గుడ్లప్పగించి సూడ్డమే..'' అంటున్నాడు ఇస్సాకు.

''అసలైనా బలేగుందిరా ఇది. ఇరవైమంది కలిపి వారంరోజులు చెయ్యాల్సిన పనిని ఒక్క రోజులో చేసి పడేసింది,'' ముసలయ్య.

తూర మీద కూర్చుని, చుట్టని వెలిగించి అన్నాడు మరో పెద్దాయన. ''మా తాత చెప్పేవోడు... ట్రాక్టర్లు కూడా ఇట్టనే దున్నేసిపోతుంటే జనం ఇరగబడి చూసేవా రంట.''

చౌదరి, దావీదు, ఇంకా కొంతమంది కుర్రాళ్లు సిగిరెట్లు తాగుతూ చూస్తున్నారు.

ఇస్సాకు చౌదరి దగ్గరకి పోయి, ''బాబూ ఈ మొత్తం పనికెంతవుతుంది?'' అనడిగాడు.

చౌదరి నవ్వి, ''ఎంతైతేటుంది ఇస్సాకూ...మనకి పని కావాలంతే కదా...''

''ఆ...ఈ కాలవ పూడికతీస్తే మాకొచ్చేదేముంది? బొచ్చెలు కడుక్కోడానికి, బట్టలుతుక్కోడానికీ తప్ప.''

''నీకెంత నీకెంత అని వాటాలేసుకుని చేత్తార్రేట్రా? ఊరుమ్మడి పనన్నాకా చేపించాల్సిందే,'' దావీదు.

''అందుకనే అడుగుతున్నా... ఊరుమ్మడి పని కదా ఊరుమ్మడి పైసలు కదా... మరి ఊరికి లెక్క తెలొద్దా?''

''ఎలక బొక్కలెతుక్కునేవోడివి నీకెందుకురా లెక్కలు?''

''ఆ మరి నీలాటి బొక్కలెతకడం నాకురాదు మరి,'' దావీదు మొఖం మాడిపో యింది.

''నాలుగు గాసుబిళ్లలు తెచ్చి ఈడి నోట్లో కుక్కితే అప్పుడు బావుపడతాడ్రా ఈడు,'' అన్నాడు.

''గాసుబిల్లలకి ఎలకలే బావుపడవు. ఇంక నేనేడ పడతాన్రా..''

అందరూ గొల్లున నవ్వారు.

చౌదరి కూడా నవ్వుతూ, "దా... దావీదూ అలా వెళ్లి పని చూసొద్దాం," అంటూ బండి తీశాడు. ఇద్దరూ కాలవ గట్టంట పొయ్యాకా,

చుట్ట కాలుస్తున్న పెద్దాయన, "అయినా ఇసాకా... పెద్దంతరం సిన్నంతరం లేకుండా ఏట్రా ఆ మాటలు?" అన్నాడు.

"అంతేమరి మనిషి జన్మెత్తేకా మాటల్తోనే కదా బతకాలి."

"నీకన్నా ఆ ఎలకలే నయింరా బాబు."

"ఆ మాట నువు నాకు సెప్పాలా పెద్దోడా... అసలు నేను కిందటి జన్మలో ఎలకనే. ఏదో పాపం చేబట్టి మనిసినై పుట్టా."

"ఏటి సిన్నాన్నా నువు చేసిన పాపమూ."

"ఏటంటవా... తోళమటు జరుగురా..." తూర మీద గొంతుక్కూర్చుని,

"ఏటంటే నేను పూర్వజన్మలో ఎలకన్రా... చగ్గా బుజ్జిగా ఉండే ఎలకని, ఓసారి వాన కురిసిన తరువాత ఎండలో బొక్కలోంచి బయిటకొచ్చి దాచుకున్న జాం కాయ తింటున్నాను. ఇంతలో- అది జాంచెట్టు కిందన్న మాట- చెట్టు కొమ్మమీద ఓ చిలక వాలి, 'ఎలకా ఎలకా నేను చిలకని. ఈరోజు నాకు తినడానికి ఒక్క జాంకాయీ దొరకలేదు. నీ దగ్గరున్న జాంకాయి యివ్వవా?' అనడిగింది. నేను అప్పుడు ఎలకని కదా. ఆ సిలక వంక చూసి, 'ఎర్రటొంకర ముక్కూ... చేలో పురుగులాంటి రంగూ... నువ్వా చిలకంటే... నేనింకా చిలక నాలా అందంగా ఉంటుందనుకున్నా నీకీనుపో...' అన్నా. పాపం ఆ చిలక చాలా బతిమలాడింది. ఆయినా నేనీలే. అప్పుడా చిలక, 'ఓరి ఎలకాధమా ఏ జంతువుల్లోనూ పక్షుల్లోనూ లేని లక్షణం నీకెందుకొచ్చింది. నాకు ఆకలేస్తోంది అంటే జాంకాయి ఇవ్వనందుకు నువ్వు వచ్చే జన్మలో మనిషివై పుట్టుగాకా...' అని శాపనార్థాపెట్టేసింది. అలా నేను మడిసినయ్యాననన్నమాట," అన్నాడు.

చుట్టూ చేరిన వాళ్లు విరగబడి నవ్వారు.

"మరైతే సిన్నానా... ఆ చిలకేటైపోయింది?" అడిగాడో కుర్రాడు.

"ఏటైపోద్దిరా ఎట్టనందుకు నేను మనిషినయ్యాను. అడిగినందుకు అది చిలకై పోయిందంటే ఎక్కడో ఎగురుతా ఉంటుంది."

*

చౌదరి, ఇస్సాకు పదోతరగతి వరకూ కలిసే చదువుకున్నారు. బోర్డు స్కూల్లో ఇద్దరూ ఆటలకీ పాటలకీ కలిసే ఉండేవాళ్లు. హైస్కూలుకి పొరుగూరు వెళ్లాకా మెల్లిగా స్నేహం తగ్గిపోయింది. ఇద్దరికీ చదువు మాత్రం అబ్బలేదు. పదో తరగతి ఫేలయిపోయి ఎవరి పనుల్లో వాళ్లు పడిపోయారు. అంతదాకా చౌదర్ని ఒరే అని పిలిచే ఇస్సాకు మెల్లిగా అండిలోకి, గారులోకి వచ్చేశాడు.

వద్దు వద్దన్నా భార్య కొయిటా వెళ్లిపోవడంలో ఇస్సాకు అగ్గిమీద గుగ్గిలమై పోయాడు. కానీ చేసేదేముంది? మెల్లిగా పిల్లల్ని చూసుకుంటూ కొయిటానించి వచ్చే డబ్బుతో తాగి తందనాలాడ్డం అలవాటైపోయింది. కూలిపన్లకీ, కాకినాడ సెక్యూరిటీకీ వెళ్లడం మానేశాడు. ఒక్క ఎలకలు పట్టడం మాత్రం మానలేదు.

బాగా పొద్దోయి అందరూ ఇళ్లలో టీవీలు చూసే వేళ తన యింటి వసారాలో కూర్చుని ఎలకని వొండుతూ పాటలు మొదలుపెట్టాడు.

*నాది నాదనియేవు నాది అనియేవు*
*నీకున్నదేటే ఎలకా*
*బొక్కలన్నీ తవ్వి ధాన్యాన్ని దాచేవు*
*ఆ ధాన్యమే నీది కాదే*
*గడబిడా తిరిగేవు తోక వూపేవు*
*నీ తోక నీదా ఎలకా*
*తోక పట్టీ తెచ్చి చితుకులోల తగలేసి*
*కూరొండుకుంటనే ఎలకా...*

"ఎదవ సచ్చినోడు ఎలకల్ని కాల్చి వూరంతా కంపు కొట్టిస్తున్నాడు," అంది మరియమ్మ

"ఆహా... అలాగా... మరి నువు కోణ్ని కాల్చినపుడు కంపుగాక ఏటొత్తదేటి?" గయ్యిన లేచాడు ఇస్సాకు.

"ఛీ నోర్ముయ్ తింగరోడా..."

వీది లైటు కింద సూర్రావు పెద్ద గొంతుతో అరుస్తున్నాడు.

"కాలవ పక్కన నాలుగెకరాల భూమిని ఇళ్ల స్థలాలకిమ్మని పెట్టాంకదా. ఎమ్మార్వో కూడా ఇస్తానన్నాడు. ఇప్పుడా భూమిని తవ్వేసి చేపల చెరువు చేసేస్తే మనం సూత్తా వూరుకోడమేనా?"

నాగుపాములా లేచాడు ఇస్సాకు. రివ్వున సూర్రావు దగ్గరికి పోయి, "తవ్వేత్తన్నాడా... తవ్వేస్తడ్రా... చౌదరిబాబు పోక్లీనరు తెచ్చినప్పుడే అనుకున్నాను. తోకలేని దావీదుగాడు ప్రెసిడెంటయ్యినపుడే చౌదరిగాడికి కొమ్ములొచ్చినాయ్... ఇప్పుడేటి పీకుతారు?" అన్నాడు.

"నువ్వూరుకోహె..." అంటూ సూర్రావు దావీదు ఇంటివేపు వెళ్లాడు. "ఒరే దావీదూ" అని పిలిచాడు. దావీదు ఇంటో లేడు.

"ఆడు ఇంటిలో ఉండడు. ఆడూ చౌదరిగాడూ కలిసి బొక్క లెతుకుతారు."

మర్నాడు కాలవగట్టు మీద సూర్రావు పదిమంది కుర్రాళ్లనేసుకొచ్చి చౌదరితోని దావీదుతోని గొడవపడ్డాడు.

అప్పటికే నాలుగెకరాల చేనుని నాలుగడుగుల లోతున తవ్వేసి చెరువులు చేసింది పొక్లీనర్. చక్కగా గట్లు కూడా పోసేసింది.

''ఒక్కడితో వదల్ను నేను... చౌదరీ... చాలా దూరంపోద్ది. నేను కాకినాడ పోతా. కలెక్టర్‌కీ, ఎస్పీకి రిపోర్టు ఇస్తా. మీ అంతు తేలుస్తా...'' అంటూ వీరంగ మాడాడు సూర్రావు.

''ఏటీ తేలుస్తావురా సూర్రావూ... అక్కడ చెరువులు రెడీ అయిపోయాయి. పంట కాలువల్లో మోటారెడ్డి నీళ్లు తోడేస్తారు. చేప సీడు తెచ్చి ఏసేస్తారు. నువ్వేమో కాకినాడ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ వుండు. ఈళ్లు చేపలమ్ముకొని మేళ్లు కడతుంటారు.''

''నోరుముయ్యిరా ఎదవ కొడకా... గవ్వకి పనికి మాలినోడు కూడా చెప్పేడమే,'' విసుక్కున్నాడు సూర్రావు.

''నువ్వట్టగే అంటావుగానీ భూమి కావాలంటే భూమ్మీద నిలబడి దెబ్బలాడ కుండా ఆఫీసుల చుట్టూ తిరుగుతారేట్రా... భారతంలో పంచపాండవులు ఏ ఆఫీసుల చుట్టూ తిరగలేదు. కురుచ్చేత్రంలో నిలబడి దెబ్బలాడారు. తెల్దా ఏటి?''

సూర్రావు దానికి ఏమీ అనకుండానే తన చుట్టూ ఉన్న కుర్రాళ్లతో మంతనాలు చేస్తున్నాడు.

''ఓరే... సూర్రావూ నీక్కావల్సిందేటో నాకు తెల్సుగానీ... నేనో ప్లాను చెపుతా యినుకో...'' అని చౌదరి వంక చూస్తూ, ''చౌదరి బాబుగారు మమ్మల్ని కొట్టేశాడని మీ కమ్యూనిస్టోళ్లందర్నీ తీసికెళ్లి కలెక్టరాఫీసుకాడ ధర్నా చేసేయ్... అప్పుడు దిగుతాడు చౌదరి బాబుగారు..'' అని పకపకా నవ్వాడు.

నవ్వి నవ్వి,

''బాబు చౌదరి బాబుగారు మరేటనుకోకండి. తమరి గెడ్డం కింద గెంజి తాగి బతికెటోళ్లం. ఏదో ఇలాటి ధర్నాలు చేసుకోవడం తప్ప మరేటి చేయ్యగలం చెప్పండి...'' అని మళ్లీ నవ్వాడు.

సూర్రావు మరి కొంతమంది బళ్లు వేసుకొని కాకినాడ పోయారు.

గుంపు చెదిరిపోయాకా ఇస్సాకు తిన్నగా మందు కొట్టుకి పోయి తాగేశాడు. కొట్టు నడిపే చెల్లయమ్మతో, ''చెల్లమ్మా.. సూత్తా ఉండు... ఈ చౌదరిగాడు ఎప్పుడో నిన్ను సంపేత్తాడు,'' అన్నాడు.

చెల్లాయమ్మ నవ్వి, ''చౌదరి గురించి నువ్వు నాకె సెప్పాలా ఇస్సాకు... వూరు కాని వూరు బతకొచ్చినోల్లం. పెద్దల మాటినకపోతే ఎట్ట కుదురుతుంది చెప్పు,'' అంది.

''అంతేలే చెల్లమ్మా. కన్నంలో ఎలకలాంటి దానివి నువ్వు. వొచ్చే జన్మలో రామసక్కని సిలకై పుడ తావులే...''

చెల్లాయమ్మ నవ్వి, ''పోన్లే ఇస్సాకు... రాత్రి పాదాలమ్మ గరువుకాడ మకాంలో పార్టీ ఉందంట... నీ ఫ్రెండు చెప్పమన్నాడు. సూర్రావునీ అందర్నీ పిలిచాడు,'' అంది.

''ఓహో... పార్టీ అంటే ఫారిన్ సరుకే... జై... జై... చౌదరీ... జై... చౌదరీ...'' అని తూలుకుంటూ పోయాడు.

రాత్రి పార్టీలోకూడా ఫుల్లుగానే తాగేశాడు.

*

ఇస్సాకు బొంద పెట్టేసి జనమంతా వచ్చి కొట్టు కాడ కూర్చుని తాగుతున్నారు.

పెరట్లో ఉన్న జామచెట్టు మీద ఆకుల వెనక కూర్చుని ఉంది చిలక. రావల్సిన ఒక మాట వస్తుందా రాదా అని చూస్తోంది అది.

''ఆడు స్థిరం తక్కువ్వోడే కానీ ఆడు చెప్పినవన్నీ మాత్రం నిజాలేరా... అడు నిక్కార్సయిన మనిషి,'' అంటున్నాడు సూర్రావు.

దావీదు బుర్రూపుతూ, ''ఆడు తిట్టినా... ఏం చేసినా ఆళ్లాటి మనిషి ఈ ఊళ్లో మళ్లీ పుట్టడురా... ఆడి పెళ్లాం నాకు సెల్లెలే... అలాగాడు నాకు బామ్మర్ది. నా సెల్లి కొయిటా ఎల్లిన్నుంచీ అడట్టగయిపోయాడుగానీ మానూల్లో ఫస్టు గుండా పదో తరగతి చదివినోళ్లలో ఆడే ఫస్టు... ఆడు అత్తమానం నన్నేడిపిస్తాడు. నేను చౌదరిగాడి మనిషినని...'' అంటూ ఏడ్డం మొదలుపెట్టాడు. ఆ తడి రాసిన గొంతుతోనే, ''నేనెవడి మనిసిని కానని నాకు తెల్సు... అయాం దావీద్... దావీదంటే... దావీదే...'' అంటూనే పెద్దగా ఏడ్చాడు.

సూర్రావు మిగతా వాళ్లందరూ ఏమీ మాట్లాడ కుండా ఎవరి గ్లాసు వాళ్లు తాగుతున్నారు.

కాసేవు వెక్కిళ్లు పెట్టి సగం గ్లాసు తాగేసి, ''ఎలకలంటే ఎర్రి ఆడికి. ఊరంతా ఎలకలానే తిరిగాడు. ఆఖరికి కుడితిలో పడ్డ ఎలకలానే పొయ్యాడు,'' అన్నాడు.

అంత ఏడుపులోనూ... అంత మైకంలోనూ ఉదయం మందు తిని చచ్చిన ఎలకని చూసి నవ్విన చౌదరి గుర్తొచ్చి వొళ్లు జలదరించింది దావీదుకి.

అది కనిపెట్టింది చిలక. ఆ అసురసంధ్య వేళ అది అరిచిన అరుపు ఊరి మీద గావుకేకలా వినొచ్చింది.